

పరిగి, డిసెంబర్ 29: పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ద్వారా వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పరిగిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా నాలుగు ఆర్టీసీ బస్సులను, అంబులెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభిం చారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీల చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలత, ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# బస్సుల కోసం ఎదురుచూపులు



బస్సుల కోసం పరిగి బస్టాండ్‌లో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

**సాయంత్రం సమయంలో హైదరాబాద్ బస్సుల కొరత**

పరిగి, డిసెంబర్ 29 : పరిగి నుంచి హైదరాబాద్‌కు నిత్యం వందలాది మంది ప్రయాణికులు వెళ్తుంటారు...అలాంటిది సాయంత్రం సమయంలో సుమారు గంటన్నరపాటు హైదరాబాద్‌కు బస్సులు లేక ప్రయాణికులు రోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిగి పట్టణంలోనే ఆర్టీసీ డిపో ఉండగా కోస్గి డిపో నుంచి, అలాగే నారాయణపేట్ డిపో నుంచి సైతం పరిగి మీదుగా హైదరాబాద్ బస్సులు నడిపిస్తారు. ఇదిలావుండగా సాయంత్రం సుమారు 5.20గంటల నుంచి 7 గంటల వరకు పరిగి నుంచి హైదరాబాద్‌కు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర డిపోల నుంచి సైతం ఆ సమయంలో హైదరాబాద్‌కు బస్సులు లేవు. పరిగితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలో పనిచేసేందుకు వచ్చిన ఉద్యోగులు, ఇతర వ్యాపారులు తిరుగు ప్రయాణంలో సాయంత్రం హైదరాబాద్ వెళ్లడానికి బస్సులు లేకపోవడంతో కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండగా చాలా మంది బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్సులు ఉన్న సమయంలోను ప్రయాణికులతో కిక్కిరిసి ప్రయాణాలు సాగుతుండగా గంటన్నర పాటు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే సమయంలో బస్సులు నడిపించకపోవడం పట్ల ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి సైతం తీసుకువెళ్లినా ఈ సమయంలో బస్సులు నడిపించడం లేదని, ఇది సరైన పద్ధతి కాదంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని సాయంత్రం సమయంలో పరిగి నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వికారాబాద్, డిసెంబర్ 29 : అలంపూర్‌లోని జోగులాంబ అమ్మవారిని ఆదివారం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. చిత్రంలో డాక్టర్ సబితా ఆనంద్, కూతురు వినూత్నా , కుమారుడు వైభవ్ ఉన్నారు.

## ఎంవీ ఫౌండేషన్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



వికారాబాద్, డిసెంబర్ 29 : పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా ఎం.వి (మామిడిపూడి వెంకట రంగయ్య ) ఫౌండేషన్ పని చేస్తున్నదని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ శాంతా సిన్హా అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో ఎం.వి ఫౌండేషన్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది ఈ సంస్థలో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉండటం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ శాంతా సిన్హాకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్ విక్రయానికి యత్నం.. ముగ్గురు అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబర్ 29: ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. షేక్‌పేటలో నివాసం ఉంటున్న ఎండీ అబ్దుల్ ఇర్ఫాన్(31), మహ్మద్(30) , వికారాబాద్ ప్రాంతానికి చెందిన రహ్మాన్ అలీలు కొంతకాలంగా డ్రగ్స్ విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో న్యూ ఇయర్ వేడుకల్లో కస్టమర్లకు సరఫరా చేసేందుకు ఇర్ఫాన్ శనివారం రాత్రి ఫిలింనగర్ కొత్త చెరువు సమీపంలోకి వచ్చాడు. అక్కడ తన వద్దనున్న 17గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను మహ్మద్, రహ్మాన్ అలీలకు విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి అమ్ముతున్నట్టు ఇర్ఫాన్ తెలిపాడు.

### ఎయిర్‌పోర్టులో ప్రయాణికురాలు హల్‌చల్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 29 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికురాలు హల్‌చల్ చేసింది. శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. ముంబైకి చెందిన అఫ్రీనా అనే మహిళ ఫ్యాషన్ డిజైనర్‌గా పని చేస్తున్నది. ఇటీవల ముంబై నుంచి హైదరాబాద్ వచ్చిన ఆమె శనివారం రాత్రి తిరుగు ప్రయాణంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో హైదరాబాద్ నుంచి ముంబై వెళ్తుంది. విమానంలోకి ఎక్కిన వెంటనే మద్యం మత్తులో ఉన్న ఆ మహిళ .. కేకలు వేయడంతోపాటు ఇతర ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. దీనిపై ఎయిర్ లైన్స్ సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 3 నుంచి నుమాయిష్

- మాజీ ప్రధాని మన్మోహన్ మరణంతో 2 రోజులు ఆలస్యం
- ప్రవేశ రుసుం రూ.50కి పెంపు
- జనవరి 7న మహిళలకు మాత్రమే ప్రవేశం
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న డబుల్ డెక్కర్ బస్సు




సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్, చిత్రంలో ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, పబ్లిసిటీ కన్వీనర్లు సురేశ్ కుమార్, డాక్టర్ సురేశ్‌రాజ్

అబిడ్స్, డిసెంబర్ 29: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏటా జనవరి 1 నుంచి మొదలయ్యే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) ఈసారి కాస్త ఆలస్యంగా ప్రారంభం కానున్నది. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 3 నుంచి నుమాయిష్ మొదలవుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ బి. ప్రభాశంకర్ వెల్లడించారు. ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటినరీ హాల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈసారి ప్రవేశ రుసుమును రూ.40 నుంచి రూ.50కి పెంచామని, సీనియర్ సిటిజన్ల కోసం వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతున్నామని, జనవరి 7న ఎగ్జిబిషన్‌లో మహిళలకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని వివరించారు. సందర్శకులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్నామని, అందులో భాగంగా 100 సీసీ కెమెరాలను, వాచ్ టవర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం మైదానమంతటా వాటర్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు 2 ఫైరింజన్‌లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. సందర్శకుల సౌకర్యార్థం ఈసారి ఎగ్జిబిషన్‌లో మినీ ట్రైయిన్‌తోపాటు కొత్తగా ఆధ్వర్యంలో కూడిన డబుల్ డెక్కర్ బస్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని, దీని టికెట్ ధరను రూ.40గా, మినీ ట్రైయిన్ టికెట్ ధరను రూ.30గా నిర్ణయించామని చెప్పారు. సమావేశంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, పబ్లిసిటీ కన్వీనర్లు సురేశ్ కుమార్, డాక్టర్ సురేశ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## 'మా భూములను లాక్కోవద్దు'



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో కాలువ తీసిన దృశ్యం

పరిగి, డిసెంబర్ 29: పరిగి మండలం రంగాపూర్ తండా పరిధిలో బాలికల గురుకుల పాఠశాల, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం ప్రభుత్వం భూమిని కేటాయించింది. శనివారం సాయంత్రం స్థలం చుట్టూ జేసీబీతో కాలువ తీయించేందుకు పోలీసులు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. తమకు ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వకుండా భూములు లాక్కొంటే తాము బతికేదెట్ల అని ఆగ్రహం వ్యక్తం చేశారు . వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, భూమికి భూమి లేదా పరిహారం చెల్లించాలని, మమ్మల్ని రోడ్డుపాలు చేయవద్దని వేడుకున్నారు.

# గోవా కేంద్రంగా ఎన్‌డీపీఎల్ మద్యం సరఫరా

**వాస్కోడీగామా రైలులో రూ.2లక్షల విలువ చేసే మద్యం పట్టివేత**



సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా గోవా నుంచి రైలులో నగరానికి తీసుకువస్తున్న రూ.2లక్షల విలువ చేసే నాన్‌డ్యూటీ పెయిడ్( ఎన్‌డీపీఎల్) మద్యాన్ని శంషాబాద్ అబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ కథనం ప్రకారం...నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో కొన్ని రోజులుగా గోవా నుంచి నగరానికి పెద్ద ఎత్తున నాన్‌డ్యూటీపెయిడ్ మద్యం సరఫరా జరుగుతోంది. ఈ మేరకు సమాచారం అందుకున్న ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలు శంషాబాద్, ఫలక్‌నుమా, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్‌ల వద్ద నిఘా పెట్టి గోవా నుంచి వచ్చే రైళ్లలో సోదాలు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం గోవా నుంచి సికింద్రాబాద్ వస్తున్న వాస్కోడీగామా రైలులో తనిఖీలు చేపట్టగా పలువురి వద్ద రూ.2లక్షల విలువ చేసే 43ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లు లభించాయి. ఈ మేరకు మద్యం బాటిళ్లను సీజ్ చేసి మద్యం సరఫరా చేస్తున్న పలువురికి నోటీసులు జారీ చేశారు. శనివారం మహబూబ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వచ్చిన వాస్కోడీగామా రైలులో 95ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లు లభించిన విషయం తెలిసిందే. గత రెండు రోజులుగా రైళ్లలో సోదాలు జరుపుతూ పెద్ద ఎత్తున ఎన్‌డీపీఎల్ మద్యం పట్టుకున్న ఏఈఎస్ జీవన్ కిరణ్, ఎస్‌టీఎఫ్ సీఐ సుభాష్‌చందర్, డీటీఎఫ్ సీఐ బాలరాజు, ఎస్‌ఐలు వెంకటేశ్, రవిలను ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి, డీసీ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ కిషన్‌లు అభినందించారు.

## గుండెపోటుతో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి



జూబ్లీహిల్స్, డిసెంబర్ 29 : యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు (45) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. 2012 బ్యాచ్‌కు చెందిన బాలరాజు బెటాలియన్‌లోని ఆర్మ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అథారిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సెలవుపై స్వస్థలమైన భువనగిరికి వెళ్లాడు. ఇంటివద్ద గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని దవాఖానకు తరలిస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు బెటాలియన్ అధికారులు తెలిపారు. బాలరాజు మృతితో బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..



మర్పల్లి, డిసెంబర్ 29 : మండలంలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకుడు ఎండీ.రహీమ్, తండ్రి ఖలీల్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్ ఆదివారం ఖలీల్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.. అధైర్య పడొద్దని అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీకాంత్ రెడ్డి రూ.25 వేలు, మధుకర్ రూ.25 వేలు. రహీమ్‌కు అందజేశారు.. అదే విధంగా బూచన్‌పల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త పవన్ ఇటీవల మృతి చెందగా మాజీ జడ్పీటీసీ మధుకర్ ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బుచ్చయ్య, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, నాయకులు ఖాజాషరీఫ్, వెంకట్ ఉన్నారు



### వలలో చిక్కిన కొండ చిలువ..

మండల కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో ఓ కొండచిలువ వలకు చిక్కింది. ఆదివారం కొందరు స్థానికులు చేపల వేట కోసం చెరువుకు వెళ్లారు. ఆ చెరువు సమీపంలో వారికి వలలో చిక్కిన భారీ కొండ చిలువ కనిపించింది. దీంతో వారు పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. స్థానిక ఎస్‌ఐ రవిగౌడ్ అక్కడికి చేరుకుని ఆ కొండ చిలువను సమీపంలో ఉన్న అడవిలోకి వదిలేశారు.
-దౌల్తాబాద్, డిసెంబర్ 29

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



మలక్‌పేట, డిసెంబర్ 29: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన పింజరి బషీర్ అహ్మద్ కుమారుడు మహ్మద్ ఫయాజ్ (25) పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేందుకని రెండేళ్లక్రితం నగరానికి వచ్చి పాత మలక్‌పేట డివిజన్‌లోని వాహెద్‌నగర్ అబూబకర్ మసీదులోని గదిలో ఉంటూ చదువుకుంటున్నాడు. కాగా.. మూడు రోజులుగా గది తెరవకపోవడం, గదిలోనుంచి దుర్వాసన రావడంతో మసీదు నిర్వాహకులు శనివారం రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గది తలుపులు తెరిపించి చూడగా పూర్తిగా కుళ్లిపోయిన దశలో ఉన్న ఫయాజ్ మృతదేహం కనిపించింది. ఎస్‌ఐ భరత్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతునికి మూర్ఛవ్యాధి ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో వైద్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం మత్తు.. ఆపై అతివేగం

- డివైడర్‌ను ఢీకొని గాల్లోకి ఎగిరిన కారు
- స్వల్ప గాయాలపై బయటపడిన జంట
- పోలీసులతో దురుసు ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబర్ 29: మద్యం మత్తులో అతివేగంగా కారు నడుపుతూ యాక్సిడెంట్ చేయడంతోపాటు పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన యువజంటపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన తీగుళ్ల దయాసాయి రాజ్( 28), స్నేహితురాలితో కలిసి కారులో శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో పార్టీకి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పార్టీ ముగించుకుని జూబ్లీహిల్స్ మీదుగా ఇంటికి బయలుదేరారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.1లోని నందమూరి బాలకృష్ణ ఇంటి సమీపంలోకి రాగానే అతివేగంగా ఉన్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ధాటికి కారు గాల్లోకి ఎగిరి రోడ్డుకు రెండోవైపు పడిపోయింది. ఈ ఘటనలో కారు తుక్కుతుక్కయింది. కాగా.. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో వారిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని వారిని పీఎస్‌కు తీసుకువెళ్లారు. పీఎస్‌కు తీసుకువెళ్తున్న పోలీసులపై వారు బూతులు తిట్టడంతో పాటు దురుసుగా ప్రవర్తించారు. వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 29 : జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల మేరకు .. మహబూబాబాద్ జిల్లా, గార్లమండలం, పోచారం గ్రామానికి చెందిన పఠాన్‌బియాబాని(54)కి కుటుంబీకులు ఎవరూలేరు. కొన్నాళ్లక్రితం తండ్రి చనిపోగా మానసికంగా కుంగిపోయాడు. పైగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ఈనెల 28న హైదరాబాద్‌కు వచ్చి దూలపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్ పైనుంచి ఆదివారం దూకి ఆత్మహత్మకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలోనే పఠాన్ చనిపోగా వాచ్‌మన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



## ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు..



మర్పల్లి, డిసెంబర్ 29 : మండల కేంద్రం నుంచి రైల్వే గేటు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన చెట్ల కొమ్మల్లో నుంచి కరెంటు వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాలకు, గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు పూర్తిగా చెట్ల కొమ్మల్లో నుంచే ఉన్నాయని, చిన్న గాలి వచ్చినా కొమ్మలు తగిలి మెరుపులు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు చెట్ల కొమ్మలను తొలగించి కరెంటు వైర్లను సరి చేయాలని అటునుంచి వెళ్లే ప్రయణికులు, వాహనదారులు కోరుతున్నారు .




సమావేశంలో మాట్లాడుతున్న ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు బోడ అనిల్, మన్నే కుమార్

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

- ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

రవీంద్రభారతి, డిసెంబర్ 29: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,200కోట్లను వెంటనే విడుదల చేయాలని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బోడ అనిల్, మన్నే కుమార్‌లు అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలపై, అదే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం గురించి పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఫిబ్రవరి 25,26వ తేదీలలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ సభలకు ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఆర్ఎస్‌పీ కేరళ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్, ఏఐపీఎస్‌యూ జాతీయ కార్యదర్శి షఫీ ఉల్లా , వివిధ జిల్లాల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు.

భవిష్యత్ ఉద్యమకార్యాచరణను రూపొందించుకునేందుకు నూతన ప్రభుత్వ విద్యావిధానంపై కాషాయికరణకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 25,26లలో సభలను నిజామాబాద్ జిల్లాలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభలకు విద్యార్థులు, మేధావులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, రాజు, రవిగోపాల్‌సింగ్, ఠాకూర్, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962